

వివాదంలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల కమ్యూనిటీహాల్ స్థలం





ఖిల్ నాయక్..!

పట్టాలన్నీ గుప్పిట్లో పెట్టుకుని..

కార్మికుల స్థలాలు అమ్మేసిన నాయకుడు

కాలనీలో సగానికి పైగా నకిలీలే

కమ్యూనిటీ హాల్ కోసం కొన్న స్థలమూ స్వాహా

న్యాయం చేయాలని కోరుతున్న కార్మికులు

కదిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అందరి కోసం ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని నాయకుడైన ఒక్కడే రోజుకింత తినేస్తున్నాడు. కార్మికుల ప్రతినిధి అవతారమెత్తి ప్రతి పట్టాను తన గుప్పిట్లో ఉంచుకున్నాడు. పైసలిచ్చిన వారికి పట్టాలు ఇస్తూ తన జేబును లక్షల రూపాయలతో నింపుకుంటున్నాడు. ఇదంతా కదిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుటే జరుగుతున్నా ఏమని ప్రశ్నించేవారే లేరు. ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునే అధికారే లేరు. ఎందుకంటే ఆయన అధికార పార్టీ నాయకుడు కావడమే కారణం. గడచిన 7 నెలల కాలంలోనే ఇష్టా రాజ్యంగా ప్లాట్లు అమ్ముకున్నట్లు తెలిసింది. మరో పక్క అదే నాయకుడు తమ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కొనుగోలు చేయాలనుకున్న భూమిని కూడా తన పేరున రాయించుకున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికుల కాలనీలో సగానికి పైగా నకిలీలు ఉన్నట్లు సమాచారం. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

323 పట్టాల మంజూరు

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయానికి ఎదురుగా 2007 సంవత్సరంలో కదిరి పొలం సర్వే నెంబర్ 1769,70లో దాదాపు 7.95 ఎకరాల భూమిని ఇళ్ల పట్టాలకు కేటాయించారు. ఇందులో భవన నిర్మాణ రంగానికి సంబంధించిన 323 మంది కార్మికులకు పట్టాలు మంజూరు చేశారు. అప్పటి ప్రభుత్వం పట్టాలను తమకు నేరుగా ఇవ్వకుండా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడికి అందజేసినట్లు కార్మికులు పేర్కొన్నారు. పట్టాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా కార్మిక నాయకుడు తన వద్దే పెట్టుకున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే ఆయన తనకు ఇష్టమొచ్చిన వారికి, తనకు డబ్బు ఇచ్చిన వారికి పట్టాలు ఇస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పట్టాల అమ్మకం జోరందుకున్నట్లు తెలిసింది. గత 17సంవత్సరాలుగా నిర్మాణాలే లేని ఆ కాలనీలో గడచిన 7 నెలల్లోనే రోడ్డుకు ముందు వరుసలో దాదాపు 28 ఇళ్లు నిర్మించారు. అవి కూడా అన్ని కాంప్లెక్సులే. వీటిలో ఎక్కువమంది అనర్హులే ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్క ప్లాట్‌ను రూ.15 లక్షల వరకు పెట్టి కొన్నట్లు తెలిసింది. వారందరికి ఈ కార్మిక నాయకుడే అమ్మినట్లు సమాచారం.

సగానికి పైగా నకిలీలే

భవన నిర్మాణ కార్మికుల కాలనీలో కొంతమందికి మాత్రమే పట్టాలు అందాయి. వీరలో ఎక్కువమంది కార్మిక నాయకుడికి డబ్బు చెల్లించినట్లు తెలిసింది. డబ్బు చెల్లించలేని వారు పట్టా తీసుకోలేకపోయారు. ఈ లోపు ఇదే కాలనీ ముందు ఆర్డీఓ కార్యాలయంతో పాటు పలు కార్యాల యాలు, విద్యాలయాలు, టిడ్కో ఇళ్లు నిర్మించారు. దీంతో ఆ పట్టాలు ఉన్న భూమి విలువ అమాంతం పెరిగింది. ఈ నేపథ్యంలో ఆ కార్మిక నాయకుడు తన వద్ద ఉన్న పట్టాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నట్లు తెలిసింది. రోడ్డు ముందు భాగంలో పరిశీలిస్తే అన్ని కొత్త నిర్మాణాలే కనిపిస్తాయి. 323 పట్టాల్లో ప్రస్తుతం బేస్‌మెంట్ వేసిన వారిలో సగం మందికి పైగా నకిలీ పట్టాదారులే ఉన్నారని పట్టాలు మంజూరైన కార్మికులు ఆరోపిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమంగా పట్టాలు పొందిన వారు బయటికి వస్తారని కార్మికులు చెబుతున్నారు.

విలువైన స్థలం సొంతానికి..

భవన నిర్మాణ కార్మికుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించడానికి సర్వే నెంబర్ 1713(2)లో 2.5 ఎకరాల భూమిని డబురు వెంకటప్ప నుంచి సాధారణ ధరకు కొనుగోలు చేశారు. అయితే ఆ భూమిని అదే కార్మిక నాయకుడు తన పేరుతో రాయించుకున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలం కొనడానికి 2007వ సంవత్సరంలోనే 323 మంది కార్మికులు ఒక్కొక్కరు రూ.2500 నుంచి రూ.5000 వరకు చెల్లించినట్లు చెబుతున్నారు. కార్మిక సంఘం పేరుతో శాశ్వత ఖారురు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే ఆ నాయకుడు మాత్రం తమకు తెలియకుండా ఆ భూమిని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ స్థలం విలువ కోట్ల రూపాయలకు పెరిగింది. అంత విలువైన స్థలం కార్మికులకు దక్కకుండా సొంతం చేసుకున్న ఆ కార్మిక నాయకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



2007లో పట్టాలు పొందిన కార్మికులు

మా జాగా అమ్మేశాడు

నాభర్త పేరుతో జాగా(ఇంటిస్థలం)వచ్చింది. మా ఆయన చనిపోయాడు. ఆ తరువాత జాగా కోసం అక్కడికి వెళితే డబ్బు చూసుకొని రాండి అని అహమ్మద్ అలీ అన్నాడు. తాను తిరిగి డబ్బు చూసుకొని వెళితే జాగా అప్పటికే వేరే వాళ్లకి అమ్మేశారని అక్కడి వారు చెప్పారు. మాకు చాలా అన్యాయం చేశాడు.

- బేల్దారి శివయ్య భార్య రత్నమ్మ, కుమ్మరవాండ్లపల్లి



నా బేస్‌మెంట్‌ను అమ్ముకున్నాడు..



నాకు ఇచ్చిన స్థలంలో 2007లో బేస్‌మెంట్ వేసుకున్నా. ఇళ్లు కట్టుకుందామని వెళితే ఈ బేస్‌మెంట్ నీది కాదని కార్మిక నాయకుడు అహమ్మదలి పొమ్మన్నాడు. కొన్ని రోజుల తర్వాత వెళితే బేస్‌మెంట్ కావాలంటే రూ. 50వేలు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నేను డబ్బు ఇవ్వలేకపోవడంతో నా బేస్‌మెంట్ వేరే వాళ్లకు అమ్ముకున్నాడు.

- శంకర్, బేల్దారి, కుమ్మరవాండ్లపల్లి

విచారణ చేస్తున్నాం

భవన నిర్మాణ కాలనీలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై సమగ్ర విచారణ చేయడానికి ప్రత్యేక కమిటీని నియమించాం. విచారిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ అనుమతి లేకుండా స్థలాల్లో ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టాలు ఎవరైన అమ్ముకుంటున్నారా, దీని వెనుక ఎవరు ఉన్నారు అన్న విషయం పూర్తిగా విచారణ చేస్తున్నాం. అక్రమాలపై చట్ట ప్రకారం ముందుకు వెళ్తాం.

- వీవీఎస్ శర్మ, ఆర్డీఓ

అండర్‌పాస్ నిర్మాణానికి అడుగులు

- పరిశీలించిన రైల్వే ఇంజనీర్లు
- చర్చించిన మాజీ మంత్రి పల్లె



రైల్వే ఇంజనీర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రైల్వే లైన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి రైతుల భూములకు దారిలేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి దృష్టికి తమ పొలాలకు దారి చూపాలని విన్నవించారు. వారు రైల్వేసహాయ మంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయాలని ఆ శాఖ ఇంజనీర్లకు ఆదేశించారు. శనివారం రైల్వే ఇంజనీర్లు గుప్తా, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రామ్మోహన్‌రావు, పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఇంజనీర్ గంగాధర్, సెక్షన్ ఇంజనీర్ లోకేశ్ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి వారితో చర్చించారు. 20అడుగుల వెడల్పు, 11 అడుగుల ఎత్తుతో అండర్ పాస్ నిర్మిస్తే రైతులకు ఇబ్బందులు ఉండవని, ఇందుకు రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని నివేదికను తయారు చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలను రైల్వేమంత్రికి పంపనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ పాల్గొన్నారు.

319 మంది విద్యార్థులు గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 319 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. 42 పరీక్షా కేంద్రాల్లో 8,198 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 7,979 మంది పరీక్షలు రాశారన్నారు. ఒకేషనల్ గ్రూపులో 1,641 మంది రాయాల్సి ఉండగా 1,541 రాశారని, 100 మంది గైర్హాజరయ్యాని తెలిపారు. పరీక్షా కేంద్రాలను స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవప్రసాద్, కమిటీ సభ్యులు సురేశ్‌బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రదక్షిణలు

రైతు నడ్డి విరుస్తున్న విద్యుత్ సిబ్బంది

ప్రతి పనికీ ఓ రేటు

బోరు లేకపోయినా ఓ ఉద్యోగికి సామగ్రి

అన్నితానై వ్యవహరిస్తున్న జేఎల్ఎం



ఇంటివద్ద ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతు ఆంజనేయులు

రెండేళ్ల నుంచి తిరుగుతున్నా



రెండు సంవత్సరాల క్రితం రూ.లక్ష 49వేలు అప్పు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకున్నా. మా బంధువులు అందరం కలిసి మూడు బోర్లు వేసుకున్నాం. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకున్నాం. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు వచ్చాయి, వైర్లు, కసారాలు ఇవ్వలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇంటివద్దే ఉంచుకున్నాం. పొలం వద్ద పెడితే దొంగలు చోరీ చేస్తారని ఆరు నెలల నుంచి ఇంటివద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కాపలాకాస్తున్నాం. అదనంగా వైరు ఇస్తామని గతంలో పనిచేసిన విద్యుత్ అధికారి చెప్పడంతో రూ.10వేలు డబ్బులిచ్చాం. నెలలు గడుస్తున్నా, విద్యుత్ కనెక్షన్ రాలేదు. - చిన్నక్క, రైతు, జౌకల

నంబులపూలకుంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అప్పులు చేసి బోరువేస్తే నీళ్లు పడ్డాయి. ఈ నీరు బయటకు రావాలంటే విద్యుత్ కనెక్షన్ కావాలి. ఆ కనెక్షన్ కోసం రైతులు పడుతున్నట్లు కష్టాలు వర్ణణాతీతం. దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవరకు రైతు ఎన్ని ప్రదక్షిణలు చేయాలో అర్థం కావడం లేదు. నంబులపూలకుంట మండలంలో విద్యుత్ కనెక్షన్ కావాలంటే పైసలిస్తే తప్ప పని జరిగే పరిస్థితులు లేవు. రైతులు ముందుగా చిన్న, సన్నకారు సర్టిఫికెటు పొంది విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత ఆ శాఖ ఏఈ స్వయంగా బోరును పరిశీలించి, ఎంత దూరం, ఎన్ని స్తంభాలు పడతాయో అంచనా వేస్తారు. ప్రభుత్వ సబ్సిడీ పోనూ.. మిగిలిన మొత్తం విద్యుత్ శాఖకు రైతు జమచేయాల్సి ఉంటుంది. వరుస క్రమంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తారు. 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు 40 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఎప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ వస్తుందా అని రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి బోర్లు తవ్వుకుని, విద్యుత్ కనెక్షన్ కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. పంటలైనా సాగుచేస్తే అప్పులు తీర్చవచ్చని రైతులు ఆశలు పెట్టుకున్నారు. మండలంలో బోర్లు లేకపోయిన కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగికి ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైరు ఇచ్చారు. కానీ అవి ఎక్కడికెళ్లాయో తెలియడంలేదని సిబ్బందే ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆ శాఖ మండల ఇంజనీర్ నోరు మెదపకపోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది.



నంబులపూలకుంట విద్యుత్ కార్యాలయం

అన్నితానై వ్యవహరిస్తున్న జేఎల్ఎం

సచివాలయ వ్యవస్థ రాగానే ప్రతి సచివాలయానికి జేఎల్ఎం (జూనియర్ లైన్‌మన్) ను నియమించారు. ఆ సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కరించాల్సి ఉంటుంది. మండల కేంద్రంలో పనిచేస్తున్న ఓ జేఎల్ఎం కార్యాలయంలోనే మకాం వేశాడు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండడంతో మండల ఏఈ తనకు భారం తగ్గిందని బాధ్యతలన్నీ ఆ జేఎల్ఎంకు అప్పగించారు. మండలానికి ఈఏ చుట్టపు చూపుగా వస్తుంటారు. దీంతో ఆ జేఎల్ఎం అన్ని తానే అన్నట్లు వ్యవహరిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నాడు. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించాడు. ఆ శాఖకు చెల్లించే డిపాజిట్లు కాకుండా.. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయడానికి అదనంగా రూ. 1000 చెల్లించాలి. అంచనా వేయడానికి రూ. 1000, ట్రాన్స్‌ఫార్మర్ అందాలంటే రూ.1000, నూతనంగా నిర్మించిన ఇంటికి విద్యుత్ కనెక్షన్ కావాలంటే రూ. 200 ఇలా ధరలు నిర్ణయించాడు. సబ్‌స్టేషన్‌లో నిలువ ఉన్న సామగ్రి బయటకు వెళ్లాలన్నా ఇతడికి సుంకం చెల్లించాల్సిందే అని తోటి సిబ్బందే చర్చించుకుంటున్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న టీ దుకాణానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి రూ.16వేలు వసూలు చేసినట్లు సమాచారం.

మండల కేంద్రంలోనే ఐదుగురు..

ప్రతి సచివాలయానికి ఒక జేఎల్ఎం ఉండాలి. వీరిని ఏఈ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. మండల కేంద్రంలో రాత్రి సమయంలో గాలివాన వలన విద్యుత్ సమస్య వస్తాయని ఏఈ ఐదుగురు జేఎల్ఎంలను ఏర్పాటు చేశారు. ఇద్దరు మాత్రమే ఇక్కడ పనిచేయాల్సి ఉంది. మరికొమ్మేదిన్నె, టీఎస్ పల్లి, ఎదురుదొన సచివాలయాల్లో జేఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ గ్రామాల పరిధిలో సమస్యలు వస్తే పరిష్కరించడానికి విద్యుత్ అధికారులు అందుబాటులో లేరని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు.

డబ్బులు తీసుకున్నది నా దృష్టికి రాలేదు

జేఎల్ఎం రైతుల నుంచి డబ్బులు తీసుకున్న విషయం నా దృష్టికి రాలేదు. అలా ఇచ్చి ఉంటే విచారణ చేసి, రైతులకు న్యాయం చేస్తాం. అక్రమాలకు పాల్పడినట్లు తెలితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

- సాలేహబాషా, ఏఈ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

మహిళా అభ్యున్నతే లక్ష్యం

: కలెక్టర్ టీఎస్ చేతన్

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఎన్టీఆర్: పల్లె

శక్తియాప్ డౌన్లోడ్ చేసుకోండి: ఎస్పీ

పుట్టపర్తిలో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా సంఘానికి చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్/రూరల్ మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి శ్రీనివాస కల్యాణ మండపంలో మహిళా దినోత్సవాన్ని ఎస్పీ రత్న, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించడానికి ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కుల రక్షణ కోసం అనేక చట్టాలు చేశాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆడబిడ్డలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపం పథకం ప్రవేశపెట్టి మసిబారిన ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అనంతరం డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘం సభ్యులకు రూ.74 కోట్ల మెగాచెక్కును అందించారు. వివిధరంగాల్లో విశేష ప్రతిభకనబరచిన మహిళలు, మహిళ ఉద్యోగులను కలెక్టర్, ఎస్పీ, మాజీ మంత్రి పల్లె ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మీ, డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం, మెప్మా అధ్యక్షురాలు పద్మావతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

- బాల్యవివాహాలను వందశాతం అరికట్టాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వేడులకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ భారీకేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రారంభించిన శక్తియాప్ మహిళల భద్రత విషయంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దానిని అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వారం రోజులపాటు నిర్వహించిన వారోత్సవాల పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. సవేరా ఆసుపత్రి వైద్యురాలు విష్ణుప్రియాంక మహిళలకు ఆరోగ్యసూత్రాలను తెలియచేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ, శ్రీనివాసులు, సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు సురేష్‌సునీత, ఇందిర పాల్గొన్నారు.

హాకీలో జిల్లా జట్టుకు రజతం



రజత పతకం సాధించిన జట్టుతో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 6వతేదీ నుంచి 8వతేదీ వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బందనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. క్వార్టర్‌ఫైనల్లో విజయనగరం జిల్లా జట్టుపై 3 గోల్స్, సెమీ ఫైనల్‌లో గుంటూరు జిల్లా జట్టుపై 3-1గోల్స్ తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుందన్నారు. ఫైనల్‌లో తిరుపతి జిల్లా జట్టుపై 6-2 గోల్స్‌తో ఓటమి చెంది ద్వితీయ స్థానం సాధించిందని వివరించారు. హాకీ అసోసియేషన్ ప్రతినిధులు బీవీఆర్ శ్రీనివాసులు, వేణుగోపాల్, గౌరీప్రసాద్, రాము, మహ్మద్‌అస్లాం తదితరులు అభినందించారు.

అబ్బేదొడ్డిలో చైన్ స్నాచింగ్


తెగిన బంగారు గొలుసు

గుత్తిరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డిలో శనివారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇంటి ఎదుట పని చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మెడలోని బంగారం చైన్‌ను లాగాడు. అయితే ఆమె అప్రమత్తమై చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో అది రెండు భాగాలుగా తెగిపోయింది. ఆమె కేకలు వేయడంతో దొరికిన ముక్కతో దుండగడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి మృతి


మృతి చెందిన రవి

గుత్తిరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామ శివారు 67వ జాతీయ రహదారిపై శనివారం అనుమానాస్పద స్థితిలో బేల్దారి రవి(36) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రవి బేల్దారి పని చేసుకుంటూ జీవించేవాడు. గుత్తికి చెందిన యువతితో ఇతడికి వివాహం జరిగింది. అయితే ఆమె ఆరు నెలల కిందట భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. పని నిమిత్తం బయటకు వెళ్తున్నానని శుక్రవారం రాత్రి రవి తల్లిదండ్రులకు తెలిపాడు. ఉదయం శ్రీపురం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో బేల్దారి రవిగా గుర్తించి కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీఆర్పీ అదుపులో దొంగ

రూ. 79 వేలు స్వాధీనం


నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొమ్ముతో జీఆర్పీ పోలీసులు

గుంతకల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): రైళ్లల్లో నేరాలకు పాల్పడిన ఓ వ్యక్తిని అనంతపురం జిల్లా రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.79 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌లో అరెస్టు వివరాలను సీఐ అజయ్‌కుమార్ తెలియజేశారు. రైల్వే ప్లాట్‌ఫాంలపై అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించే క్రమంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గుంటూరు నగరానికి చెందిన హర్షవర్ధన్ రెడ్డి అనే ఈ వ్యక్తి ఏడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని విచారించామన్నారు. క్రమంలోనే అతడిని రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వ్యక్తిగా గుర్తించామ న్నారు. అతడిని అరెస్టుచేసి రూ. 79 వేలు, ఒక బంగారు డాలర్, రెండు వెండి పట్టీలు, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలిం చినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వైసీపీ నాయకుడి దాడి

చెన్నేకొత్తపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై అల్లుడితో కలిసి వైసీపీ నాయకుడు చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం దాడిచేయగా.. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. స్థానికంగా ఉన్న జయమ్మ అనే వృద్ధురాలి ఇంటి పక్కనే వైసీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డి వాటర్ ప్లాంటు ఉంది. అందులో నుంచి వృథా నీరు వృద్ధురాలి ఇంటి ముందు నుంచి వెళ్తోంది. నీరు నిల్వ ఉండి ఇబ్బందికరంగా ఉందని, పైపులు ఏర్పాటు చేసుకుని పక్కకు తరలించుకోవాలని వృద్ధురాలు తెలిపింది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసులురెడ్డి, అల్లుడు మురళీధర్‌రెడ్డితో కలిసి వృద్ధురాలిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రేపు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పలు కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 10వతేదీన ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ, ముత్తూట్‌ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకాం చదినిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8121717846ను సంప్రదించాలని తెలిపారు.

టీటీసీ ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ-2024 లోయర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 27న నిర్వహించిన పరీక్షలు ఫలితాలు ఈ నెల 7న విడుదలయ్యాయన్నారు. ఫలితాలు http-s://www.bse.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లు త్వరలో డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాకు వస్తాయన్నారు. సర్టిఫికెట్లు రాగానే విద్యార్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 240 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నా రు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.


బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు


అంకురార్పణ (ఫైల్)

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కదిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకుర్పారణతో మొదలై ఈనెల 23న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా వీక్షించేందుకు కదిరి ప్రాంతనుంచేకాకుండా చుట్టుపక్కల జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రంనుంచి లక్షలాది మంది తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహిని ఉత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. శ్రీవారి బ్రహోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటితో పాటు ఉచిత భోజన సదుపాయాన్ని ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు కదిరికి నారా లోకేశ్

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈనెల 10న కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం పీవీఆర్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరగనున్న కల్యాణోత్సవానికి లోకేశ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఆయన పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కదిరి నియోజకవర్గంలో జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు ఇవ్వడం టీడీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించామని గుర్తు చేశారు. ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. యువత పెద్దఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు ఉండకూడదని అన్నారు. భక్తులకు అసౌకర్యం కలిగితే ఈఓ, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాని తెలిపారు. పోలీస్ శాఖ ఫ్రెండ్లీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హిందూపురం రోడ్డులో ఉచితంగా మినీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషన్ కిరణ్‌కుమార్, ఈఓ శ్రీనివాసరెడ్డి, సీఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల్లో పండ్ల తోటల దగ్ధం


పెనకచర్లలో ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో పండ్ల తోటలు కాలిపోయాయి. గార్లదిన్నె మండలం పెనకచెర్లలో చీనీ చెట్లు, కల్లూరు గ్రామంలో మామిడి చెట్లు, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో దానిమ్మ తోట అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో లక్షల రూపాయల పంట నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంట కళ్లెదుటే అగ్నికి ఆహుతవడంతో రైతులు బోరున విలపించారు.

గార్లదిన్నె/అనంతపురంరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చీనీతోటలు కాలిపోయాయి. దీంతో రూ. 15 లక్షలు ఆస్తి నష్టం కలిగింది. పెనకచెర్ల గ్రామానికి చెందిన రైతులు రామాంజనేయులు, అనిల్ తమకున్న పొలంలో చీనీచెట్లు సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈఏడాది దిగుబడి బాగా వచ్చిందని సంబరపడ్డారు. మరో 10 రోజులుంటే కోతకొయాల్సి ఉంది. రామాంజనేయులు సుమారు 600 చెట్లు, రైతు అనిల్ దాదాపు 500 చీనీచెట్లను ఏడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం వీరి తోటలలో మంటలు వ్యాపించి చెట్లను దహించివేశాయి. సుమారు రూ. 15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. జమేదార్ ఫిరోజ్ బాషా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతులతో వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరులో మామిడి చెట్లు ...

కల్లూరు గ్రామంలో విశ్వమూర్తి అనే రైతుకు చెందిన మామిడి చెట్లు శనివారం దగ్ధమయ్యాయి. కొండకింద కొట్టాల సమీపంలో రైతు విశ్వమూర్తి మామిడి పంట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు 15 మామిడి చెట్లు కాలిపోవడంతో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

తాటిచెర్లలో దానిమ్మతోట..

అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్లలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో దానిమ్మతోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన బ్యాళ్ల లక్ష్మీనారాయణ మూడు ఎకరాల్లో నాలుగేళ్ల కిందట దానిమ్మ సాగు చేశారు. దాదాపు 1200 చెట్లు పెంచుతున్నాడు. అయితే శుక్రవారం సాయంత్రం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి వెలువడిన నిప్పురవ్వలతో మంటలు వ్యాపించి తోట కాలియింది. దానిమ్మ చెట్లతో పాటు, తోటలోని బోరు బావి వద్దనున్న పైపులైన్, స్టార్టర్ పెట్టె, కేసింగ్ వైరు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


తాటిచెర్లలో కాలి పోయిన దానిమ్మ తోట

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య


తరుణ్ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గాజులవారిపల్లి గ్రామానికి చెందిన పల్లపు ఈశ్వరప్ప ఏకైక కుమారుడు పల్లపు తరుణ్ (20) శనివారం సాయంత్రం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన మేరకు నాలుగు నెలల కిందట పేరంవాడ్లపల్లికి చెందిన నీరుగొట్టి నరసింహులు అనే వ్యక్తి తరుణ్‌పై పోలీస్ కేసు పెట్టాడు. ఆరోజు నుంచి తన కుమారుడు ఈ కేసు విషయంగా బాధపడుతుండేవాడని తండ్రి ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలోనే మనస్తాపం చెందిన అతను ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. తరుణ్ ఓడీచెరువులోని వెంకటసాయి ఐటిఐలో ఎలక్ట్రీషియన్ రెండో సంవత్సరం చదువుతున్నట్లు చెప్పారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తన కుమారుడి మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం రాత్రి శవంతో బంధువులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు.

డాలీ ఉద్యోగ విరమణ

పోలీసు జాగిలానికి ఎస్పీ సత్కారం


హ్యాండ్లర్‌కు మెమెంటో అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖకు జాగిలం డాలీ అందజేసిన సేవలు మరువలేనివని ఎస్పీ జగదీష్ అన్నారు. పదకొండేళ్లపాటు సేవ లందించిన డాలీ శనివారం బాధ్యతల నుంచి విరమణ పొందింది. ఈ సందర్భంగా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డాలీని ఎస్పీ సత్కరించారు. డాలీ హ్యాండ్లర్ నాగభూషణను అభినందించి, జ్ఞాపికను అందజేశారు. 2014లో ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడు ఈ జాగిలాన్ని అనంతపురం జిల్లాకు కేటాయించారు. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు తదితర నేరాల ఛేదింపులో డాలీ క్రియాశీలక పాత్ర పోషించింది. దాదాపు 300 నేర ప్రదేశాల్లో తనిఖీలలో పాల్గొంది. చెప్పుకోదగ్గ 30 నేరాల ఛేదింపునకు సహకరించింది. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్‌బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

5,857 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 5,847 కేసులకు న్యాయాధికారులు పరిష్కారం చూపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 బెంచులు నిర్వహించారు. రాజీ పడదగిన 886 క్రిమినల్ కేసులు, 80 సివిల్ కేసులు, 48 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 388 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాద కేసులలో రూ.3,83,82,000 కక్షిదారులకు పరిహారం ఇప్పించారు. సివిల్ కేసులలో రూ.2,82,11,464 పైగా, ప్రీ లిటిగేషన్ కేసులలో రూ.68,80,800 ఇప్పించారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

చీనీ టన్ను రూ. 24వేలు

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 404 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అన్నింటా రాణింపు

నారీమణి చిత్రాన్ని అద్భుతంగా గీసిన ఉపాధ్యాయుడు



రామగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారీమణి చిత్రాన్ని చిత్రీకరించారు. నేటి సమాజంలో మహిళ అన్ని రంగాల్లో రాణిస్తోందని చూపుతూ స్త్రీని తల్లిగా , వ్యాపారవేత్తగా, వైద్యురాలిగా, ఉపాధ్యాయురాలిగా, క్రీడలు, వ్యాయామ విభాగాల్లో సైతం మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చాటి చెబుతూ రంగుల్లో ఓ చిత్రాన్ని అద్భుతంగా గీశారు. దీన్ని చూసిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరాములు మాస్టారును అభినందించారు.

ఆడబిడ్డను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం: డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేకుండా ప్రతి ఆడబిడ్డను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం అని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి పిలుపునిచ్చారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లోనూ అభివృద్ధిపథంలో నడుస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలకు భయపడకుండా పనిచేయాలని మహిళా వైద్య ఉద్యోగులకు సూచించా రు. కార్యక్రమంలో ఏఓ గిరిజా మనోహర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్, మహిళా ఉద్యోగులుపాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనంతపురం విద్య, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులను శనివారం డిబార్ చేశారు. జనరల్ విద్యార్థులు 20,313 మందికి గాను 19,829 మంది హాజరు కాగా 484 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,438 మందికిగాను 2301 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారు. అనంతపురం పట్టణంలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా డిబార్ చేశారు. అనంతపురంలోని శ్రీసత్యసాయి బాలికల జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ 4 కేంద్రాలను, కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10 కేంద్రాలను, కస్టోడియన్లు 13 కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 621 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

రేషన్ కోసం ఎదురుచూపులు..!

- వేలిముద్ర వేసినా.. అందని బియ్యం
- రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న తుమ్మలబైలు పెద్దతండా ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గాండ్లపెంట, మార్చి8 (ఆంధ్రజ్యోతి): పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంతవరకు అందలేదని మండలంలోని తుమ్మలబైలు పెద్దతండా గ్రామస్థులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా ఉచితంగా ఇచ్చే రేషన్ వేలిముద్రలు వేయించుకుని, తరువాత ఇస్తామని డీలర్లు చెప్పారని అంటున్నారు. డీలర్లపై నమ్మకంతో గ్రామంలోని 180 కుటుంబాల వారు వేలిముద్రలు వేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కేంద్రం ప్రతి పేదవాడి ఇంటికి రేషన్ అందిచాలన్నది లక్ష్యం. అయితే తుమ్మలబైలు పెద్దతండాలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. రేషన్ ఎప్పుడిస్తారా అని తండావాసులు ఎదురుచూస్తున్నారు.

బియ్యం ఎప్పుడిస్తారో?: ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ఎప్పుడిస్తాయా అని తుమ్మలబైలు పెద్దతండా వాసులు ఎదురుచేస్తున్నారు. తండాలో సర్వర్ పనిచేయడంలేదు. ఒకచోటచేరి అందిరితో వేలిముద్రలు వేయించుకుంటారు. ఫిబ్రవరి నెలలోకూడా ఈతంతు కొనసాగింది. అలాగే గతంలో లాగానే ఇంటింటికి బియ్యం ఇస్తారన్న నమ్మకంతో వేలిముద్రలు వేసినట్లు తండావాసులంటున్నారు. ఫిబ్రవరి నెలంతా రేషన్ ఇవ్వలేదు. మార్చిలోకూడా ఇస్తామని చెబుతున్నారేకానీ, ఇంతవరకు పంపిణీచేయలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సక్రమంగా బియ్యం అందించాలని తండావాసులు కోరుతున్నారు.

అగని అవకతవకలు: తుమ్మలబైలు పెద్దతండాలో రేషన్ బియ్యం పంపిణీలో అవతకవలు జరుగుతున్నాయని తండావాసులు విమర్శిస్తున్నారు. గత వైసీపీ పాలనలో 2024జనవరిలో అప్పటి డీలర్ బియ్యం పంపిణీ చేయకుండా వేలిముద్రలు వేయించుకున్నారని ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. గతంలో ఆ డీలర్‌ను తొలగించి, రెవెన్యూ అధికారులో బియ్యం పంపిణీ చేశారు. ఆ తంతు ఇప్పుడుకూడా కొనసాగుతుందా అన్న సందేహాలు తండావాసులు వ్యక్తం చేస్తున్నారు. ఈయేడాది ఫిబ్రవరి, మార్చినెలల్లో ఇప్పటివరకు రేషన్ బియ్యం అందించకుండా వేలిముద్రలు వేయించుకుని మిన్నకుండిపోయారంటున్నారు. డీలర్ చేతివాటం ప్రదర్శించారా లేదా పక్కదారి పట్టాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సివిల్ సప్లై అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం కేటాయించలేదు, శ్రీరాములు, డీలర్

స్టాక్‌పాయింట్‌నుంచి బియ్యం రాలేదు. అందుకే కార్డుదారులకు బియ్యం అందించలేదు.

విచారణ చేపడతాం: వాణీ, సీఎస్‌డీటీ, గాండ్లపెంట

ప్రభుత్వం అందిస్తున్న చౌకబియ్యం ప్రతినెలా లబ్దిదారులకు అందించాలి. వేలిముద్రలు వేయించుకుని బియ్యం ఇవ్వలేదన్న విషయం తన దృష్టికి రాలేదు. తండాలో విచారణ చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తాం.

బియ్యం ఇస్తామంటున్నారు



రేషన్ బియ్యం గతనెలలో వేలిముద్రలు వేయించుకున్నారు. ఈనెలలో మరోమారు వేలిముద్రలు వేయించుకుని, రెండూ ఒకేసారి ఇస్తామని చెబుతున్నారు. తమకు ప్రతినెలా బియ్యం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

నరసింహులు నాయక్, తుమ్మలబైలు పెద్దతండా

ఘనంగా ఫన్‌డే



స్టాల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ధర్మవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం ఫన్‌డేను ఘనంగా నిర్వహించారు. వినూత్న విద్యావిధానాలతో స్కూల్ యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో పిల్లలు స్వయంగా వారి జ్ఞానానికి, సామర్థ్యానికి తగిన విధంగా కౌన్సిస్టాల్స్ నిర్వహిస్తూ ఫన్‌గేమ్స్ పాటు వ్యాపార సామర్థ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ఐస్క్రీమ్‌స్టాల్, స్నాక్స్, స్వీట్స్, మిల్లెట్ ఫుడ్ స్టాల్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, రవీంద్ర పాల్గొన్నారు.

డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతి



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తనకల్లు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన హర్షాద్‌ఖాన్ అన్నమయ్య జిల్లాలోని కందుకూరుకు వెళ్లే రోడ్డు సమీపంలో ఐదు ఎకరాల్లో బొప్పాయి పంటను సాగుచేశాడు. పంట పూర్తికావడంతో చెట్లు ఎండిపోయాయి. పంట తొలగిద్దామన్న సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు పొలం సమీపంలోని గుట్టకు శనివారం రాత్రి నిప్పు పెట్టారు. మంటలు పొలంలోని బొప్పాయి తోటకు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు రైతుకు సమాచారం ఇచ్చారు. పొలం వద్దకు ఆయన చేరుకునే సమయానికి బొప్పాయి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. చెట్లతోపాటు పొలంలో ఏర్పాటుచేసిన డ్రిప్, పైపులు, వైర్లు కాలిపోయాయి. ఆయన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అన్నమయ్యజిల్లాలోని ములకచెరువునుంచి అగ్రిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించారు. కొంత సమయానికి మంటలను అదుపు చేశారు. అప్పటికే డ్రిప్, వైర్లు కాలిపోయాయి. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

టాటా ఏస్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన టాటాఏస్ వాహనం

గాండ్లపెంట, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టాటాఏస్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు గాండ్లపెంటకు వేరుశనగకాయల లోడుతో వస్తున్న టాటాఏస్ వాహనాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రాయచోటినుంచి కదిరికి వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి వెనకనుంచి ఢీకొంది. టాటాఏస్ రోడ్డు పక్కనున్న గుంతలో అదుపు తప్పి పడిపోయింది. టాటా ఏస్ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరిఅర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కదిరి మండలం, ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోసెస్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కుటాగుళ్ల వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి విధుల బహిష్కరణ

కదిరిఅర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారానికి 10, 17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్నట్లు ఎన్టీఆర్ వైద్య సేవ మిత్ర యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ షేక్‌బాబ్‌జాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యేళ్లతరబడి తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసును కాంట్రాక్టు విధానంలోకి మార్చాలన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కలించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

వైద్యశిబిరానికి స్పందన



రోగులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

కదిరిఅర్బన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ఎంపీపీ పాఠశాలలో కిమ్స్‌సవేరా ఆసుపత్రి అనంతపురం వారిచే శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని ఎమ్మెల్యే ఆదేశాలమేరకు నిర్వహించినట్లు టీడీపీ నాయకులు గంగులప్ప, నల్లబాపినేని భార్గవ్ తెలిపారు. శిబిరంలో గుండె, కంటి, షుగర్, బీపీ పరీక్షలుచేశారు. వందమంది రోగులకు చికిత్సలు అందించినట్లు తెలిపారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకోసం అనంతపురం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది, రోగులు, ఎంపీటీసీ పుల్లయ్య, నాయకులు మల్లికార్జున, ఈశ్వరయ్య రాధాకృష్ణ, ప్రభాకర్, పవన్ పాల్గొన్నారు.

రెస్కో మాజీ చైర్మన్ గంగిరెడ్డి మృతి

నల్లమాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలప్పగారిపల్లి గ్రామానికి చెందిన కదిరి రెస్కో మాజీ చైర్మన్ సోముగుట్ట గంగిరెడ్డి(76) శనివారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. అనారోగ్యంతో ఆయన బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. 1992లో రెస్కో చైర్మన్‌గా పనిచేసి, రైతులకు సేవలందించినట్లు చెప్పారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరిఅర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని 13వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మైనొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10.30గంటలకు కదిరి బస్టాండ్ నుంచి సూపర్ లైగ్జరీ బస్సులు బయలుదేరుతాయన్నారు. మొదట గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, అరుణాచలం వెళ్లనున్నట్లు చెప్పారు. 35 నుంచి 40మంది ప్రయాణికులు ఉంటే వారి ప్రాంతానికి బస్సులు పంపుతామన్నారు. ఒక్కొక్కరికి టికెట్ రూ.1,140 నిర్ణయించామన్నారు.

రాజీకి లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం



పుట్టపర్తి: లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి రాకేష్

పుట్టపర్తిరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీకాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారమని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఐపీసీ (సీసీలు) 62 కేసులు, మద్యం సీసీ కేసులు 28, సివిల్‌కేసులు4, ఎస్‌టీసీ కేసులు 71, బ్యాంకు పిల్‌కేసులు 6తో కలుపుకుని 143కేసులు, సీజ్డ్‌మనీఫైన్‌తో కలిపి 60800, బ్యాంకు ప్రీలిటిగేషన్ కింద8,57,500 విలువ గల వివిధ కేసులు రాజీమార్గంలో పరిష్కరించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు నాగేంద్ర, లెక్కల యదుభూషణ్, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పూజారి ప్రసాద్, నిడిమామిడి శ్రీనివాసులు, భారతిరెడ్డి, చల్లా చంద్రశేఖర్, కుంచెపు శ్రీనివాసులు, మౌనిక, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్, సివిల్‌క్లర్క్ అశ్వత్థనారాయణ, ఎంఎల్ఏసీ లక్మానాయక్ పాల్గొన్నారు.

రాజీమార్గంతో జీవితం సుఖమయం

ధర్మవరం: రాజీమార్గంతో జీవితం సుఖమయం అవుతుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ మెగాలోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ చిన్నచిన్న గొడవలు, క్షణికావేశంతో కేసుల్లో ఇరుక్కొని చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారి కోసం జాతీయ మెగాలోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అదాలత్‌లో 308 కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. విడాకుల కేసులు 3, బ్యాంకు రుణం 2(రూ.42వేలు), ప్రీలిటిగేషన్ కేసు 1(రూ.2లక్షలు), జరిమానా కేసులు 4(రూ.13వేలు), ఈపీ 2(రూ.1,19లక్ష), భరణం 1, భూమి పరిష్కారం 3, కొట్లాట కేసులు 126, సారా కేసులు 65(1.91లక్షలు), ఇసుక రవాణా కేసులు 14 (రూ..1.84లక్షలు), పేకాట కేసులు 88 (రూ.1,50,430) పరిష్కరించినట్లు తెలిపారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి వీవీ హరీశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలు ఎన్ని ఉన్నా.. మనిషి మారాలి

కదిరిలీగల్: చట్టాలు ఎన్ని ఉన్నా మనిషి మారనప్పుడు ఫలితాలు ఆశాజనకంగా ఉండవని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి అన్నారు. జాతీయ లోక్‌ఆదాలత్ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ వరకట్నం తీసుకోవడం, దొంగతనం చేయడం, మహిళలను వేధించడం నేరమని తెలిసి కూడా మూర్ఖంగా పాల్పడుతూనే ఉంటే కట్టడి చేయడం ఎలాగని ప్రశ్నించారు. అసాంఘిక కార్యకలాపాలన్నీ చట్ట వ్యతిరేకమని తెలిసికూడా మనిషి పాల్పడుతుండటం వల్లే పరిస్థితి దిగజారి పోతోందన్నారు. మహిళ చదువుకోవాలి, చైతన్యవంతురాలు కావాలన్నారు. మహిళ యోగక్షేమాలలో పురుషుని పాత్ర కూడా ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఇరువురూ సమానమేనని ముందుకు వెళ్లినప్పుడు సమస్యలు ఉత్పన్నం కావన్నారు. న్యాయాధికారి బుజ్జప్ప, న్యాయవాదులు సత్యనారాయణగుప్త, అంబటి శివప్రసాద్, లోకేశ్వర్‌రెడ్డి, రామస్వామి, రఘునాథ్, పవన్, సీఐ డీవీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



కదిరిలో మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

న్యూస్ బాక్స్

ఎస్పీకి ఆత్మీయ సత్కారం



ఎస్పీని సన్మానిస్తున్న డీఎస్పీలు, విజయ్‌కుమార్, ఆదినారాయణ

పుట్టపర్తి రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తూ తమను ముందుకు నడిపిస్తున్న ఎస్పీ రత్నను పోలీసు అధికారులు, మహిళా సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీని శాలువాతో సత్కరించి మెమెంటోను అందచేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తమను ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. వారంరోజులుగా జిల్లావ్యాప్తంగా జరిగిన మహిళా సాధికారత వారోత్సవాలను విజయవంతం చేయడంలో కృషి చేసిన డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ, శ్రీనివాసులు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, సీఐలు సునీత, సురేష్, ఇందిర, ఆర్ఎస్‌ఐలు వీరన్న, ప్రదీప్‌సింగ్, వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించి శాలువా మెమెంటోలతో సన్మానించారు.

జనసేన ఆవిర్భావ సభను
విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న జనసేన నాయకులు

పుట్టపర్తి రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్ పిలుపినిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రవేట్‌భవనంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చలో పిఠాపురం కార్యక్రమానికి బొగ్గరం శ్రీనివాసులు, పూలశివప్రసాద్, మేకల ఈశ్వర్‌లను సమన్వయ కమిటీసభ్యులుగా నియమించామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులను కార్యకర్తలను సమన్వయం చేసుకుని 14న పిఠాపురంలో నిర్వహించనున్న 12వ ఆవిర్భావసభను విజయవంతం చేయాలని పిలుపినిచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్, మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు రాము, దాసరిశ్రీనివాసులు, గోవర్ధన్, వేణు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బత్తలపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబాపురం సమీపంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేసి నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అందించిన సమాచారం మేరకు తంబాపురం సమీపంలోని ఓ వ్యవసాయ తోట వద్ద పేకాట ఆడుతున్నట్లు తెలుసుకుని సిబ్బందితో దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30,060, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

కదిరిఅర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం రోడ్డు గట్టు వద్ద శనివారం విద్యుదాఘాతంతో యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు విద్యుత్ స్తంభంపై వైర్లు లాగుతుండగా, అర్తికు విద్యుత్ సరఫరా కావడంతో ఆసిఫ్ అనే యువకుడు గాయపడినట్లు తెలిపారు. విద్యుత్ కూలీ పనులకోసం వచ్చిన వ్యక్తి ఆసిఫ్ అన్నారు. అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తనను అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారని మీనాక్షి అనే మహిళ టూటౌన్‌పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులుతెలిపిన మేరకు మారుతీ నగర్‌కు చెందిన సత్యనారాయణ బంగారు షాపులో పనిచేస్తున్నాడు. సత్యనారాయణతో తల్లి, మామా, ఆడపడచులు తరచూ వేధింపులకు గురిచేస్తున్నారని మీనాక్షి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు భర్త, అత్త, మామా, ఆడపడచులపై కేసు నమోదు చేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మహిళను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, ఆర్డీఓ

కదిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు టీడీపీ కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పీవీఆర్ గ్రాండ్‌లో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారిత, స్వావలంబన కోసం కృషి చేస్తోందన్నారు. ఎన్టీరామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబానాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారన్నారు. నేడు ఎన్నో రంగాల్లో డ్వాక్రామహిళలు రాణిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి ఆర్డీవో వీవీఎస్ శర్మ అధ్యక్షత వహించారు. ఆర్డీవో సతీమణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అరుణమ్మ ప్రత్యేక గీతాన్ని ఆలపించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, మెప్మా సిబ్బంది గిరి, మాధవి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బాహుద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, అల్ఫా ముస్తఫా, రాజేంద్రనాయుడు, సావిత్రమ్మ, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ పాల్గొన్నారు.



ధర్మవరంలో తెలుగుమహిళలతో కలిసి కేక్‌కట్ చేస్తున్న పరిటాల శ్రీరామ్



ధర్మవరం: కాకతీయ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



ధర్మవరం: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఓడీసీలో మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ రఫీక్



తనకల్లులో...



నంబులపూలకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



తాడిమర్రిలో కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ క్రిష్ణవేణి



బత్తలపల్లిలో...



నల్లమాడలో...

న్యూస్ బాక్స్

పొంచి ఉన్న ప్రమాదం

● అంగన్‌వాడీ సెంటర్ ఎదుట చేదబావి



అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న బావి

హిందూపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా బావి ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శ్రీసత్యసాయిజిల్లా గోరంట్ల మండలం కాటేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌కు, పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రతినిత్యం 30మంది పిల్లలు వస్తుంటారు. ఏమరపాటున ఆడుకునే సమయంలో ఎవరైనా బావిలో పడతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ బావిపై జల్లెడ ఏర్పాటుచేసి బావిని మూసేయాలని స్థానికులు కోరుతున్నారు.

బావిని పూడ్చేస్తాం : రాజేశ్వరి, సీడీపీఓ

స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది ఈ బావి సమస్యపై ఎంఈఓ, సర్పంచ్‌కు తెలిపారు. ప్రస్తుతం పిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటున్నాం. త్వరలో బావిని పూడ్చేస్తాం.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెనుకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోగ సముద్రం చెరువు ఒడ్డున వెలసిన దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారికిప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

బలిజ సంఘం కమిటీ ఎన్నిక


బలిజసంఘం అధ్యక్షుడు అశ్వత్థప్ప

సోమందేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : బలిజ సంఘ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సజ్జకంత రంగనాథస్వామి బలిజ సంఘం అధ్యక్షుడిగా పొత్తలం అశ్వత్థప్పను ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా గుడిపల్లి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అశ్వర్థప్ప మాట్లాడుతూ బలిజ కులస్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బలిజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నారాయణస్వామి, జవాజీ రమేష్, సిద్దలప్ప, కళ్యాణ్, గంగాధర్, రంగా, భీమప్ప, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య దర్గాలో ఇఫ్తార్ విందు


బాబయ్య దర్గాలో భోజనం చేస్తున్న ముస్లింలు

పెనుకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దారులకు స్థానిక బాబయ్య దర్గాలో వంశ పారంపర్య పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో సెహరీ, ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉపవాసం ఉన్నవారికి రంజాన్ మాసం ముగిసేవరకు సెహరీ, ఇఫ్తార్ భోజనం ఉచితంగా అందిస్తున్నామని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నిర్మలజ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌కు అర్హులన్నారు. టెట్ మార్కుల ఆధారిత జాబితా ప్రకారం ఎంపిక చేస్తార ని తెలిపారు. అందుకు సంబంధించిన దరఖాస్తులు ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. టెట్‌లో పాస్ అయిన వారు తమ మార్కుల జాబితా, నేటివిటి, కులధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, జిరాక్సులు 2 పాస్‌ఫోటోలు జతపరచి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రాజీనే రాజ మార్గం


లోక్ అదాలత్‌లో న్యాయాధికారి అశోక్ కుమార్

మడకశిర టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం వల్ల నగదుతోపాటు సమయం కూడా ఆదా అవుతుందని మడకశిర జూనియర్‌సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్.అశోక్ తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 159 కేసులు పరిష్కారమైనటు తెలిపారు. ఇందులో ఎక్సైజ్ సంబంధించి 130 కేసులు పరిష్కారం కాగా రూ.5,53,600లు జరిమానా విధించారు. ఎనిమిది క్రిమినల్ కేసుల్లో రూ.10వేలు జరిమానా విధించారు. అదేవిధంగా ఎస్‌టీపీకి సంబంధించి 18 కేసులు పరిష్కారం కాగా రూ.29,850లు రికవరీ అయినట్లు తెలిపారు.

ఇదెక్కడి న్యాయం?

- మార్క్‌ఫెడ్ ఏజెన్సీ అలసత్వంపై ఆగ్రహం
- తిరిగి వచ్చిన కందులతో రైతుల అవస్థలు
- న్యాయం చేయాలంటున్న టీడీపీ నాయకులు


కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పెనుకొండ రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రైతుల నుంచి వ్యాపారులు డబ్బిచ్చి పంట కొనుగోలు చేస్తారు. దాన్ని వాళ్ల వాహనాల్లో తరలించుకుపోతారు. అక్కడితో ఆ వ్యవహారం పూర్తవుతుంది. కాని ఈ సంవత్సరం ప్రభుత్వం రైతుల నుంచి కందులు కొంటామని ఆర్భాటంగా ప్రకటించింది. అందుకోసం కొనుగోలు కేంద్రాలు కూడా తెరిచింది. క్వింటాలు 7,555 చొప్పున కొంటామని ప్రకటించింది. తీరా ఆచరణలో చూస్తే రైతులను నానా తిప్పలు పెడుతున్నారు. ఇక్కడ నుంచి రైతుల నుంచి కందులను కొనుగోలు చేసి బిల్లింగ్ చేశారు. అనంతరం వాటిని ప్రొద్దుటూరు కేంద్రానికి తరలించారు. అక్కడ మార్క్‌ఫెడ్ వారికి కేంద్ర నాఫెడ్ వారికి ఏం తేడావచ్చిందోకాని వాటిలో కొంత భాగమే తీసుకుని వెయ్యి క్వింటాళ్లు తిప్పిపంపారు. పంట అమ్ముకున్నాం. ఇక ఖాతాల్లో డబ్బులు పడతాయని ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ మిగిలింది. మళ్లీ కథ మొదటికొచ్చింది. కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లిన కందులు తిరిగి


కందులను తిరిగి జల్లెడ పడుతున్న రైతులు

వెనక్కు రావడంతో రైతులు నగదురాక అయోమయంలో పడ్డారు. తిప్పి పంపిన కందుల్ని బాగుచేసి పంపాలని అధికారుల ఆదేశం. దీంతో ఏంచేయాలో తెలియక రైతులు ఆ కందులతో కుస్తీ పడుతున్నారు.

ఈ విషయాలు తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రొద్దం మండలంలోని కందుల కొనుగోలు కేంద్రాలను టీడీపీ నాయకులు మాదవనాయుడు, చంద్రమౌళి, నరహరి, తదితరులు పరిశీలించారు. కందుల విక్రయదారులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీవారు నిర్లక్ష్యం వీడి రైతులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ రొద్దం మండల వ్యాప్తంగా 6068మంది రైతులు 15వేల ఎకరాలకుపైగా కందిపంటను విస్తారంగా సాగుచేశారన్నారు. పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చిందన్నారు. పంట ఆశాజనకంగా పండటంతో రైతులు తమ కష్టాల నుంచి బయటపడతామనుకున్నారు. మార్కెట్‌లో కంది క్వింటాల్ రూ.6వేలు ఉండగా ప్రభుత్వం కందిపంటకు క్వింటాల్ రూ.7555 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దీంతో రైతులు కంది పంటను నూర్పిడిచేసి కొనుగోలు కేంద్రాలకు తరలించారన్నారు. అయితే కొనుగోలు కేంద్రాల నుంచి వారం రోజుల క్రితం కందులు కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్ అధికారులు నాణ్యతలేదని తిరిగి లారీల ద్వారా వెనక్కు పంపడంతో బిల్లింగ్ అయిన రైతులు నగదు జమ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు కందులను జల్లెడ పడుతూ నానా అవస్థలుపడుతున్నారన్నారు. ఇప్పటికైనా మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక రూపాయి తక్కువో ఎక్కువో అదే వ్యాపారులకు సరుకు అమ్ముకునిఉంటే ఈ తిప్పలు ఉండేవి కావుకదా అని రైతులు వాపోతున్నారు.

కల్లు డిపోలపై అధికారుల మెరుపుదాడి

- పరారీలో కల్తీకల్లు తయారీదారుడు
- ప్రాణాంతకమైన మత్తు పదార్థాలను వాడుతున్నారని అనుమానాలు


తయారుచేసిన కల్లును పరిశీలిస్తున్న అధికారి

మడకశిరటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా కల్లు తయారీ డిపోలపై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం మెరుపుదాడులు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి వద్ద కల్లు తయారీ డిపోపై అధికారులు దాడులు చేసి ప్రాణాంతకమైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకొన్న కల్లు తయారీదారుడు పరారయ్యాడు. అసలైన సూత్రధారుల కోసం గాలింపు జరుపుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుతెలిపారు. ఈ దాడుల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు సీఐ శ్రీనివాసమూర్తితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇదే సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 70 కల్లు దుకాణాలలో దాడులు


తయారుచేసిన కల్లును పారబోస్తున్న దృశ్యం

నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కల్లు దుకాణాలకు కల్తీకల్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. కల్లు తయారీకి ఉపయోగించే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్న ఎస్‌టీఎఫ్ అధికారులు వాటిని ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది. కల్లు తయారీకి ఉపయోగించే రసాయనాలను ల్యాబ్‌కు పంపడం జరిగిందని, దానికి సంబంధించిన రిపోర్టు వచ్చేందుకు మూడు రోజులు పడుతుందని, అప్పటి వరకు పూర్తి సమాచారం అందించలేమని అధికారులు దాటవేసే ధోరణిలో తెలిపారు. కల్లుకల్తీపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాల్సి ఉందని, త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకొంటామని అన్నారు. ఈవిషయమై స్థానిక ఎక్సైజ్ అధికారులకు సైతం తెలపకుండా నేరుగా మెరుపుదాడులు నిర్వహించారు. ఇటీవల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కల్తీకల్లుతోపాటు కర్ణాటక సంబంధించిన చీప్‌లిక్కర్ గ్రామాల్లో దర్శనం ఇస్తున్నాయని వీటిపై అధికారులు సైతం పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్లుతయారీ డిపోలపై చేసిన దాడుల పూర్తి సమాచారం, ల్యాబ్ రిపోర్టు వచ్చిన వెంటనే పూర్తిస్థాయి వివరాలు వెల్లడిస్తామని, రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

కూటమితోనే మహిళలకు 33శాతం రిజర్వేషన్

- టీడీపీ కార్యాలయాల్లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు పసుపుకుంకుమ, జాకెట్ల పంపిణీ
- మడకశిర, రొళ్ల , గుడిబండ, అగళిలో కేక్ కటింగ్


టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఐక్యత చాటుతున్న మహిళలు

పెనుకొండ రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి):మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని 33శాతం రిజర్వేషన్లు కల్పించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్నిపురస్కరించుకుని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను కూటమి నాయకులు, మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి జ్యోతి ప్రజ్వలనచేసి ఎన్టీఆర్, సావిత్రిబా పూలే విగ్రహాలకు పూలమాలలువేశారు. ఈ సందర్భంగా ప్రతి మహిళకు పసుపుకుంకుమ జాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు, మెప్మాసీఈఓ మురళికృష్ణ, సాధికబాను, కమిషనర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

హిందూపురం: ప్రపంచం మొత్తానికి జీవనాధారం స్త్రీఅని వ క్తలు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పలు ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. హిందూపురం హెడ్ పోస్టాఫీస్‌లో నారీశక్తి వారోత్సవాలు నిర్వహించారు. ఉత్తమ పోస్ట్ ఉమెన్‌గా ఎంపికైన భారతిని సత్కరించారు.


మడకశిరలో కేక్ కట్ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని

పరిగి: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం బీజేపీ మండల నాయకులు దివ్య ఛారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకుడు పరిగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోరంట్ల : స్త్రీలేనిదే జననం లేదని, గమనం లేదని, మహిళలే సృష్టికి మూలాధారమని టీడీపీ నాయకులు మనోహర్ తెలిపారు.

మడకశిరటౌన్: మహిళలు అన్ని రంగాల్లోనూరాణించాలని ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని అన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అగళి, రొళ్ల మండలాల్లోని పాఠశాలల్లో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఆర్డీటీ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీ, రీజినల్ డైరెక్టర్ మల్లికార్జునలు మాట్లాడుతూ, మహిళలు పిల్లల్ని లింగవివక్ష లేకుండా పెంచి పోషించాలని పేర్కొన్నారు. అలాగే గుడిబండలో కూడా మహిళా దినోత్సవాలు ఘనంగా జరిగాయి.

మహాధర్నాను విజయవంతం చేయండి

గోరంట్ల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 12న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. మండలంలోని మందలపల్లి, వడిగేపల్లి, పుల్లగూర్లపల్లి గ్రామాల్లోని ఉపాధి పనిప్రదేశాలకు వెళ్లి కార్మిక సంఘం నాయకులు శనివారం కూలీతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాలో కూలీలు అదిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, మహిళ విభాగం నాయకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

హంద్రీనీవా ద్వారా సోమందేపల్లి చెరువు నింపాలి

సోమందేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు హరి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరువుకు 500ఎకరాల్లో ఆయకట్టు ఉండగా 250మంది రైతులు వరిపంట సాగుచేస్తున్నారన్నారు. చెరువు ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్నాయన్నారు. అయితే చెరువు పైభాగాన క్వారీ కోసం వేసిన రహదారివల్ల నీరు అందించేందుకు అధికారులు సుముఖత చూపడం లేదన్నారు. అధికారులు స్పందించి చెరువును హంద్రీనీవా జలాలతో నింపాలన్నారు.

చట్టసభల్లో వడ్డెర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి

పెనుకొండ టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : వడ్డెర్లకు రాజకీయంగా చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర సంఘం, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30లక్షల మంది వడ్డెర్లు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉన్నారు. అప్పట్లో దివంగత నందమూరి తారకరామారావు పిలుపుతో తమ వర్గమంతా టీడీపీ వైపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, పల్లవరాజు, వడ్డె నారాయణప్ప, వడ్డెయల్లప్ప, వడ్డె చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పరిగి: టీడీపీ ఆవిర్భావం నుంచి అండగా ఉంటూ పార్టీకోసం కష్టపడిన వడ్డెర్లకు ప్రత్యేక స్థానం కల్పించి ఎమ్మెల్సీ, నామినెటెడ్ పదవుల్లో అర్హత కల్పించాలని వడ్డెర సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు వడ్డె హనుమయ్య పేర్కొన్నారు.

మామిడి చెట్లకు నిప్పు

గుడిబండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన మద్దనకుంటప్ప, సన్నమారప్ప, చిక్కన్న తమపొలంలో సాగుచేసిన మామిడి చెట్లకు ఎవరో నిప్పంటించడంతో చెట్లు కాలిపోయాయని రైతులు వాపోయారు. శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మామిడిచెట్లు, చింతచెట్లు కాలిపోయాయని దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. మడకశిర ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి మంటలు అదుపుచేశారన్నారు.

జీవనశైలి మార్పుతోనే ఆరోగ్యం

చిలమత్తూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు తమ జీవనశైలిని మార్చుకుంటే మంచి ఆరోగ్యం పొందడానికి అవకాశం ఉందని అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో కొడికొండలో శనివారం సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శి బిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల ప్రజలు ఎక్కువగా గుండె జబ్బులతో బాధపడుతున్నారన్నారు. ప్రధానంగా మద్యం సేవించడం, అతిగా దూమపానం చేయడం, మాంసం ఎక్కువగా తీసుకోవడం తదితరాల వలన అనారోగ్యాలపాలవుతున్నారన్నారు. వారిలో జీవనశైలి మార్పు చేసుకొని మద్యం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండటం వలన మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు.

కన్నుల పండువగా విమాన గోపుర కలశ స్థాపన


హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

మడకశిర టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, రాజగోపుర కలశాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండే కుంభారాధన, ద్వారారాధన, గోపుర కలశాల పంచగవ్య స్నాపన, అగ్ని ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాజగోపుర, విమాన గోపురాల కలశ స్థాపన, శయ్యాధివాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపు గడువు పొడిగించాలి

హిందూపురం అర్బన్, మార్చి, 8(ఆంధ్రజ్యోతి): కళాశాల ఫీజుతో సంబంధం లేకుండా డిగ్రీ పరీక్ష సెమిస్టర్ ఫీజు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్కె యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దాదాపు 7వేల పైబడి ఉన్నారని వారికి సెమిస్టర్ ఫీజు చెల్లించడానికి సమయం సోమవారంతో ముగుస్తుందన్నారు. అయితే అపార్ ఐడి ఎన్‌రోల్ చేసుకోవడం చాలా ఆలస్యం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంకా దాదాపు 30 శాతం విద్యార్థులు ఫీజు చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన అపార్ ఐడి అప్లోడ్ చేయాలని అది ఫీజు చెల్లించేటప్పుడే జరగాలని తెలిపారన్నారు. అపార్ ఐడి క్రియేట్ చేయాలంటే ఆధార్‌కు లింకు అయి ఉండాలన్నారు. దీంతో ఆ ఫోన్‌కు ఓటిపి వస్తుందన్నారు. అయితే ఆధార్ లింకు అయిన నెంబర్లు వారి దగ్గర లేకపోవడంతో, అప్‌డేట్ చేసుకోవడం ఆలస్యమవుతుందన్నారు. అప్‌డేట్ కావాలంటే కనీసం 15 నుంచి 20 సమయం పడుతుందన్నారు. కాబట్టి సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రమణ, దిలీప్, సేరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఅండ్ ఐజీ మిషన్ చర్చి కార్యవర్గం ఎంపిక


చర్చి నూతన కార్యవర్గ సభ్యులు వీరే

హిందూపురం అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సీఅండ్ ఐజి చర్చి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పాస్టర్ డా. స్టీఫెన్‌రాజు, కార్యదర్శిగా డాక్టర్ నాగేంద్రకుమార్, కోశాధికారిగా సాల్మన్‌రాజ్, సహాయ కార్యదర్శిగా అరుణ్‌కుమార్, సహాయ కోశాధికారిగా దేవరాజ్, గాస్పల్ కో ఆర్డినేటర్‌గా ఆంజినేయులు, సండే స్కూల్ కో ఆర్డినేటర్‌గా రుబేన్‌పాల్, గౌరవ సభ్యులుగా జార్జిబాబులను ఎన్నుకున్నారు. చర్చిల అభివృద్ధికి పాటుపడతామన్నారు.

కాటి కాపర్ల సమస్యలు పరిష్కరించండి

సోమందేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : సోమందేపల్లి మండలంలోని కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని శనివారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య తహసీల్దార్ మారుతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపర్లను నాలుగోతరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. గుర్తింపు కార్డుల నుంచి డ్రస్‌కోడ్, పనిముట్లను అందించాలన్నారు. భూమిలేని వారికి రెండెకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రమాదబీమా అందించాలన్నారు. పట్టణంలో రెండుసెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు నివేశ స్థలాలను అందించాలన్నారు. దళితవాడకు రెండెకరాలు స్మశాన స్థలాన్ని కేటాయించాలన్నారు. స్మశానానికి ప్రహరీ, రోడ్డు, బోరు, షెడ్డు, కరెంటు, నీటి తొట్టి సౌకర్యం కల్పించాలన్నారు.

కరపత్రాల విడుదల

సోమందేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 12న చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణం కోరారు. శనివారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు శ్రమకు తగ్గ ఫలితం లభించడం లేదన్నారు. మండల వ్యాప్తంగా పేస్లిప్పులు, బిల్లులు, సక్రమంగా ఇవ్వడం లేదన్నారు.

మల్బరీ షెడ్ దగ్ధం

మడకశిర రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేకలకుంట గ్రామానికి చెందిన రైతు నాగభూషణకు చెందిన మల్బరీ షెడ్ శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయి భారీగా నష్టం వాటిలింది. రైతు నాగభూషణం మాట్లాడుతూ మల్బరీ షెడ్‌తో పాటు 600 చంద్రికలు కూడ కాలిపోయినట్లు తెలిపారు. తనకు ఈ ప్రమాదం వల్ల రూ.15 లక్షలు వరకు నష్టం వాటిలినట్లు ఆదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.